నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | సెప్టెంబర్ 19, 2024 | www.navatelangana.com

సెల్‌ఫోన్ కోసం ఆత్మహత్యాయత్నం

భైంసా : సెల్ ఫోన్ పోయిందని తాగిన మైకంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు ఓ వ్యక్తి. భైంసా పట్టణం నుండి బుధవారం బామ్ని తండాకు చెందిన కాశీనాథ్ ఆటోలో తన గ్రామానికి భార్యతో కలిసి వెళ్తున్నాడు. ఈ లోపల సెల్ ఫోన్ పోవడంతో తన ఫోన్ పోయిందని, ఆటో నుండి దిగిపోయి బ్రిడ్జిపై నుంచి దూకుతానని గొడవకు దిగాడు. భార్యతో పాటు ఆటోలో ఉన్నవారు ఎంత వారించినా వినకుండా సాత్పుల్ బ్రిడ్జి పైనుండి దూకాడు. అటువైపు వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు బాధిత వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలై భైంసా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఎస్పీఎం యాజమాన్య తీరును ఎండగట్టాలి

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ఈ యాజమాన్య తీరును ప్రతీ ఒక్కరు ఎండగట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. స్థానికులకు తక్కువ జీతాలు ఇస్తూ, స్థానికేతరులకు అధిక మొత్తంలో వేతనాలు చెల్లిస్తోందని, వారి కష్టాలు చెప్పుకునేందుకు తమ వద్దకు వచ్చే కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. స్థానిక క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు యోచనను వెంటనే విరమించుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన మున్సిపల్‌కార్మికుడు నాగేష్ కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే హరీష్‌బాబు ఈ సమస్యల పట్ల స్పందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యాంరావు, సలీం, దాసరి నరేందర్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు మోక్షం..!

- అక్టోబర్‌లో జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం
- కార్డుల జారీపై విధి విధానాలు రూపకల్పన
- వీటితో పాటు ఆరోగ్యకార్డులు సైతం అందజేత
- ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాల ఎదురుచూపు

రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీపై నిర్ణయం తీసుకుంటోంది. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ క్రతువును పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఈ కార్డుల జారీపై ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించగా.. తాజాగా సమావేశమై ఈ కమిటీ నూతన కార్డులను జారీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. అక్టోబర్‌లో వీటి పంపిణీ చేపట్టాలని భావిస్తోంది. వీటికి జారీకి అవసరమైన విధివిధానాలను సైతం రూపొందించిన ప్రభుత్వం నూతన కార్డులను జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల సందర్భంగానూ హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని జారీ చేయడం ద్వారా హామీని నిలబెట్టుకోవాలని భావిస్తోంది. వీటితో పాటు ఆరోగ్యకార్డులు సైతం అందించాలని భావించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మరోపక్క ఈ కార్డుల కోసం ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రేషన్‌కార్డుకు ఉన్న ప్రాధాన్యత దేనికీ ఉండదు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకానికి అర్హులుగా ఉండాలంటే ఈ కార్డే ప్రామాణికంగా మారుతోంది. దీంతో వీటి కోసం ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏండ్లుగా ఈ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన అనేక జంటలు కార్డులకు రేషన్ బియ్యం రాకపోవడంతో బయటి మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసి తినాల్సి వస్తోంది. కూలీనాలి చేసుకొని జీవించే పేదలకు ఈ పరిణామం ఆర్థిక భారంగా మారుతోంది. ప్రభుత్వం నుంచి వివిధ రకాల ప్రయోజనాలు కూడా దూరమయ్యాయి. ఆరోగ్యశ్రీ, పింఛన్లు, తదితర పథకాలకు ఈ కార్డు జత చేయడం తప్పనిసరిగా ఉంటుంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీపై నిర్ణయం తీసుకోవడంతో ఏండ్ల ఎదురుచూపులకు తెరపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది వరకు చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించకపోయినప్పటికీ..ప్రత్యేకంగా చేపడుతామని చెప్పడంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. కార్డుల జారీకి అవసరమైన విధివిధానాలు కూడా రూపొందించే పనిలో ప్రభుత్వం నిమగ్నమవుతోంది. త్వరలోనే లబ్ధిదారుల చేతికి కార్డులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వేలాది కుటుంబాలకు లబ్ధి..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే సుమారు 7.50లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్ జిల్లాలో 1,88,549, నిర్మల్‌లో 214252, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 137284, మంచిర్యాలలో 204662 కుటుంబాలకు కార్డులున్నాయి. వీటికి అదనంగా సుమారు మరో 2 లక్షల కుటుంబాల వరకు కొత్తగా కార్డుల కోసం దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేస్తోంది. ఇది వరకు ప్రజాపాలన పేరిట చేపట్టిన సభల్లో వివిధ పథకాలకు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ..రేషన్‌కార్డులకు మాత్రం తీసుకోలేదు. తాజాగా మంత్రివర్గ ఉప సంఘం మరోసారి సమావేశమై ఈ కార్డుల జారీకి విధి విధానాలు రూపొందించింది. వచ్చే నెలలో ఈ కార్డులను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డుల జారీకి గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, మాగాణి 3.5ఎకరాలు, చెలక 7.6 ఎకరాల వరకు ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారికి అర్హులుగా ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ప్రతి ఇంటికి ఆరోగ్యకార్డులు సైతం అందించాలని భావిస్తోంది. వీటి ద్వారా ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు వైద్య సేవలు పొందేందుకు అవకాశం లభించనుంది. త్వరలోనే పూర్తిస్థాయి మార్గదర్శకాలు రూపొందించి కార్డుల జారీని చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ కార్డుల దుర్వినియోగంపైనా దృష్టిసారించాలని ప్రభుత్వం భావిస్తోంది. అనర్హులను ఏరివేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యానికి మున్సిపల్ ఉద్యోగి బలి

- వినాయక నిమజ్జనంలో అపశృతి
- క్రేన్ చక్రాల కింద పడి మున్సిపల్ ఉద్యోగి మృతి
- ఏర్పాట్ల లోపమే ప్రమాదానికి కారణం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. అర్ధరాత్రి 11-30 సమయంలో ప్రమాదవశాత్తు మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడు లింగంపల్లి నాగేష్(46) అత్యంత దారుణమైన స్థితిలో మృతి చెందాడు. అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని పలువురు మండిపడుతున్నారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు లింగంపల్లి నాగేష్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనితో పాటు పలువురు మున్సిపల్ కార్మికులకు మంగళవారం రాత్రి స్థానిక పెద్దవాగు వద్ద గణేష్ నిమజ్జనం కార్యక్రమానికి డ్యూటీ వేశారు. రాత్రి 11-30 సమయంలో వినాయక విగ్రహాలను క్రేన్ సాయంతో పెద్దవాగులో నిమజ్జనం చేస్తున్నారు. గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్ నుండి ఎత్తి క్రేన్ ముందు భాగంలో కొక్కానికి తగిలించి ఉన్న దానిపైకి తరలించారు. దాన్ని కింది నుండి బ్యాలెన్స్ చేస్తూ నీటి ప్రవాహం వైపు నాగేష్‌తో పాటు మరో కార్మికుడు ఇరిగిరాల ప్రేంకుమార్ ప్రయత్నం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా క్రేన్ ముందుకు కదిలింది. దాని ముందు భాగంలో ఉన్న వీరిద్దరు కేకలు వేస్తూ పరుగులు తీసే క్రమంలో నాగేష్ దాని చక్రాల కింద పడగా, మరో కార్మికుడు ప్రేం రెండో వైపు పడ్డాడు. దీంతో చక్రాల కింద నలిగిన నాగేష్ ఎడమ కాలు నుజ్జునుజ్జయి తీవ్రంగా గాయపడ్డాడు. రెండో వైపు పడిపోయిన ప్రేం స్వల్పగాయాలతో బయట పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న వారు నాగేష్‌ను కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు తెలుపడంతో వెంటనే కరీంనగర్‌కు తరలించారు. అక్కడ నాగేష్ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కాగజ్‌నగర్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన క్రేన్‌ను రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

ఈ ప్రమాదానికి కారణం అధికారుల నిర్లక్ష్యమని స్పష్టంగా అర్థమవుతోంది. గతంలో వినాయక నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లకు, ప్రస్తుతం చేపట్టిన ఏర్పాట్లకు తేడా ఉంది. పెద్దవాగు మున్సిపల్ పంప్‌హౌజ్ నుండి పెద్దవాగు నీటి ప్రవాహం వరకు రోడ్డు పైనుండి కిందికి ఏటవాలుగా ఉంటుంది. ఏ వాహనమైనా పెద్దవాగు ప్రవాహం వద్దకు వెళ్లాలంటే అత్యంత జాగ్రత్తగానే వెళ్లాల్సి ఉంటుంది. డ్రైవర్ అప్రమత్తంగా లేకున్నా, బ్రేకులు ఫెయిలైనా ఆ వాహనం కిందికి దూసుకువెళ్లి అక్కడ ఉన్న వారి పైకి వెళ్లే ప్రమాదముంది. దీన్ని అధికారులు గుర్తించకుండా ఎత్తయిన రోడ్డు మార్గం వద్దే క్రేన్‌ను నిలిపి ఉంచారు. అక్కడే ట్రాక్టర్‌లో నుండి విగ్రహాన్ని తీసి క్రేన్‌లో ఎక్కించి క్రేన్‌ను ముందుకు కదలిస్తూ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. ఇది ప్రమాదకరమని అధికారులు ముందస్తుగా గుర్తించకపోవడమే వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఎత్తు భాగంలో ఉన్న క్రేన్ అకస్మాత్తుగా ముందుకు దూసుకువెళ్లి అక్కడ ఉన్న ఇద్దరు కార్మికులలో ఒక కార్మికునిపైకి వెళ్లింది. దీంతో ఆ కార్మికుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కార్మికుడు నాగేష్‌ను ఢీకొనడంతోనే డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో క్రేన్ ఆగింది. లేక అలాగే ఆగకుండా ముందుకు వెళితే మరికొంత మంది ప్రాణాలు కోల్పోయి ఉండేవారని అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వేలాది మంది ప్రజలు తరలివచ్చే ఆ ప్రదేశంలో అధికారులు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మృతి చెందిన నాగేష్ (ఫైల్)



పైనుండి క్రేన్ కిందికి జారి ప్రమాదం జరిగిన ప్రాంతం

మృతదేహంతో బైటాయింపు : రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం కోసం డిమాండ్

గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి పెద్దవాగు వద్ద ప్రమాదంలో మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు లింగంపల్లి నాగేష్ మృతదేహంతో కుటుంబీకులు, తోటి కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. కరీంనగర్ ఆసుపత్రి నుండి నేరుగా మృతదేహాన్ని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డీఎస్పీ రామానుజం, కరుణాకర్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ శంకరయ్య, పలువురు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. మృతుని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్, సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు సుధాకర్, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్ తదితరులు వీరి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా కుటుంబీకులు, కార్మికులతో చర్చలు జరిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి రూ. 5 లక్షలు, ఇన్సూరెన్స్ రూ. 8 లక్షలు ఇప్పించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి హామీ ఇచ్చినా కుటుంబీకులు వినలేదు. తమకు రూ. 50 లక్షల పరిహారం కావాలని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనితో ఆందోళన రాత్రి వరకు కొనసాగింది.



ప్రమాదానికి కారణమైన క్రేన్



కుటుంబీకులు, కార్మికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తన్వీందర్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ -ముథోల్

కొత్త బస్టాండ్ ముందర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి నాయకుడు తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ నాయకులు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని బయటకు వస్తే చంపేస్తానని తన్వీందర్ సింగ్ బహిరంగంగా హెచ్చరించడం తగదని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి పట్టిన గతే పడుతుందని మాట్లాడిన తన్వీందర్ సింగ్‌పై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్న విషయాన్ని బిజెపి నాయకుడు మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధానమంత్రి మోడీతో పాటు హోం మంత్రి అమిత్ షా కనీసం స్పందించలేదని వాపోయారు. తన్వీందర్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, కిషన్ పతంగి, ముదుగుల శంకర్, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే దరఖాస్తు అందజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 13 న ప్రచురించబడిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 21 వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు అందజేయాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ముసాయిదా జాబితాలను స్థానిక గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఈ నెల 13న ముసాయిదా జాబితా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఆ జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈ నెల 21 లోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 26 లోగా పరిష్కరించడం జరుగుతుందని, తుది ఫోటో ఎలెక్టోరల్ జాబితాను ఈ నెల 28న ఆయా గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వినాయక నిమజ్జనం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సీఈఓ జితేందర్ రెడ్డి, డీపీఓ శ్రీలత, డీఎల్పీఓ, తహశీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నవతెలంగాణ-లోకేశ్వరం

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం.. గడ్చంద గ్రామానికి చెందిన వాసన వెంకటేష్ మంగళవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి మెడికల్ ప్రాక్టీస్ నిమిత్తం వేరే ఊరికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాగ తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, రూ.లక్షా5వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో స్వచ్ఛతహి కార్యక్రమం



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం స్వచ్ఛతహి సేవ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ నిషేధం పాటించాలని, తినే ఆహారం, తాగేనీరు పరిశుభ్రమైనవి తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఏపీవో వసంత్‌రావు, ఎస్‌బిఎం చంపత్, కార్యదర్శి నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లత, కేజీబీవీ ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ధ్రువపత్రాల నకలు అందజేయాలి

నవతెలంగాణ-నస్పూర్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 2019 నుండి ఇప్పటి వరకు వివిధ క్రీడా అంశాలలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నవారు, ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన వారు ధ్రువపత్రాల నకలు ప్రతులను 25లోగా అందజేయాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజారావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకలు ప్రతులపై అటెస్టెడ్ చేయించి అందజేయాలన్నారు. వివరాలకు కలెక్టర్ సమీకృత కార్యాలయం 2వ అంతస్తులో ఎఫ్-29లో సంప్రదించవచ్చని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో గురుకుల ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో గురుకులాల ఉపాధ్యాయులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా వీరు ఈ నిరసన తెలిపారు. స్థానిక కాగజ్‌నగర్ మైనార్టీ పాఠశాలలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వైద్య శాంతికుమారి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలల పని వేళలు అన్ని పాఠశాలలకు ఒకే రకంగా ఉండాలని అన్నారు. దీనిపై గతంలో తమ సంఘం చేసిన పోరాట ఫలితంగానే మార్పు జరిగిందనీ, కాని ప్రభుత్వం మళ్లీ పాత టైంటేబుల్ ప్రవేశపెడుతూ నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఈ నెల 22, 23 తేదీలలో కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించనున్నామని, 28న హైద్రాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రీతి, రాజకమలాకర్‌రెడ్డి, బాలకృష్ణ, హారిక, ప్రసన్న, కళాశాల ప్రిన్సిపల్ ప్రతిభ పాల్గొన్నారు.

సోమగూడెంలో ఎమ్మెల్యే, కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ - కాసిపేట

బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం చౌరస్తాలో బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పర్యటించారు. ఇటీవల సోమగూడెం సర్వే నెంబర్ 3పై గల షాపింగ్ కాంప్లెక్స్ భూమికి సంబంధించిన విషయంలో కొంత మందికి తమ భూమిగా కోర్టు తీర్పు ఆర్డర్ వచ్చిన క్రమంలో దీనిపై స్పష్టత లేక వ్యాపరుస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల సర్వే చేయగా షాపింగ్ కాంప్లెక్స్ భూమి ఈ సర్వేలో కాకుండా ఇతర సర్వేలో భూమి ఉందని గుర్తించినట్లు వ్యాపారస్తులు తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దీపక్ కుమార్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాను పరిశీలించారు. ఈ మేరకు షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు సమస్యలపై విన్నవించారు. 35 ఏళ్ల నుంచి సోమగూడెం మెయిన్ రోడ్డుకు దాదాపు 100 కుటుంబాలు 80 షెట్టర్లతో పాటు నివాస గృహాలలో ఉంటూ వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్నామని వివరించారు. 2015లో జీవో 59 ప్రకారం వీటిని పట్టా చేస్తామని సంబంధిత రెవెన్యూ అధికారులు చెప్పడంతో భూ విస్తీర్ణానికి అనుకూలంగా డీడీల రూపంలో చలాను కట్టామని, కాని ఇప్పటి వరకు పట్టాలు అందించలేదని, వెంటనే పట్టాలు ఇప్పించాలని విన్నవించారు. దీంతో సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు అడప పాపయ్య, మాటేటి రాంచందర్, సామల వెంకటేష్, వొడ్నాలు చిరంజీవి. కాంగ్రెస్ నాయకులు గోమాస భీమయ్య, ముత్తె భూమయ్య, దూడం మహేశ్, జైన శ్రీనివాస్, పొన్నాల కనకరాజు, వ్యాపరుస్తులు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారణమై క్రషర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

పిప్పిరి గ్రామ సమీపంలోని శ్రీ క్రిష్ణ స్టోన్ కంకర క్రషర్ క్వారీ గుంతలో పడి 12 ఏళ్ల బాలిక మృతికి కారణమై క్రషర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, యజమాన్యం తక్షణమే స్పందించి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడాడు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నడుపుతున్న ఈ క్రషర్‌పై 2009 నుండి నేటి వరకు పిప్పిరి గ్రామస్తులు ప్రతి సందర్భంలో అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించకుండా యజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. క్వారీ నడుపుకోవడానికి సర్వే నంబరు 121లో రెండు ఎకరాల భూమికి అనుమతి తీసుకొని, నిబంధనకు విరుద్ధంగా 126 సర్వే నంబర్‌లో 4.20 ఎకరాల భూమిని కబ్జా చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని తెలిపారు. 126 సర్వే నంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రకుల పేద రైతులు భూములను చదును చేసుకొని పంటలు పండించుకున్నప్పటికీ తహసీల్దార్ పేద రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ గ్రామపంచాయతీలో గత నెల 30న 18 మందికి నోటీసుల పేరుతో భూములను లాక్కోవడానికి యత్నిస్తున్నారని తెలిపారు. ఈ స్థలంలో బాలిక మృతి మొదటిది కాదని, గతంలో కూడా ఇక్కడ పలు మరణాలు సంభవించాయని తెలిపారు. దీన్ని సుమోటోగా తీసుకొని యాజమాన్యంపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు అనుమతులను ఇస్తున్న మైనింగ్ శాఖ, తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మధుకర్, మండల అధ్యక్షులు గవాలె అనిల్ పాల్గొన్నారు.

22న పీఆర్‌టీయూటీఎస్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22న కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ఆడె ప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీనివాస్‌రెడ్డి, గుండు లక్ష్మయ్య, శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నామని, 2024-26 సంవత్సరానికి గాను జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | సెప్టెంబర్ 19, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని మన్మద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ వెంకట రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి ఈ పరీక్ష నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సోలమన్‌రాజ్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మల్కగౌడ్, ఉపాధ్యాయులు, గంగాధర్, దేవేందర్, రాజేందర్ ఒడ్డి, నవీన్ కుమార్, రమాదేవి, విజయ కుమారి, సౌజన్య, గోదావరి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం గోదావరి, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-కడెం



రాష్ట్రంలో నిరుపేదల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కడెం అధ్యక్షులు వాజిద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్ షాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలో భాగంగా అభయహస్తం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మండల అధ్యక్షులు బబ్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ రఫీక్, దుంపటి వెంకన్న పాల్గొన్నారు.

బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందజేయాలి

- జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కార్మిక సంఘాల ప్రాతినిధ్యంతో బోర్డు అడ్వైజర్ కమిటీ నియమించి ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు కార్మికులకు అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణం, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు అమలు చేస్తున్న స్కీములను సహజ మరణం ప్రమాదవశాత్తు మరణం పాక్షిక అంగవైకల్యం శాశ్వత అంగవైకల్యం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం ద్వారా వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేటుపరం చేయడానికి చేస్తున్న ఆలోచనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డును పటిష్ట పరచాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం రూపంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 1979 వలస కార్మిక చట్టాన్ని 1996 కేంద్ర భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా విధానాలను రూపొందించడం సబబు కాదన్నారు. ప్రమాదవశాత్తు సహజంగా మరణించిన భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. 65 సంవత్సరాలు నిండిన కార్మికులకు ప్రతి నెల రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. దహన సంస్కారాలు, ప్రసూతి, పెళ్లి కానుకను లక్ష రూపాయలకు పెంచాలన్నారు. 2009లో ఇచ్చిన వెల్ఫేర్ బోర్డు కార్డులన్నింటినీ యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించొద్దన్నారు. బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసి పరిరక్షించాలని అన్నారు. సెప్టెంబర్ 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్ బోర్డు పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటాలలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, జిల్లా నాయకులు ఆర్.సురేందర్, సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కో కన్వీనర్ దుమాల అశోక్, నాయకుకు విఠల్, భగవాండ్లు, శంకర్, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, మారితి, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్, సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

బోస్ ఫెలోషిప్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత్ దేకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోస్ ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా 34 మంది విద్యార్థులకు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ప్రైమరీ స్కూల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా బోస్ ఫెలోషిప్ వాలంటీర్లు జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్ నేర్చుకోవాలని, దీంతో పాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందిస్తామన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది పీఓను సన్మానించి పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, పీడీ అనిత, అధ్యాపకులు నర్సింగ్‌రావ్, రాజశేఖర్, కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తన్విందర్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బోస్లే నారాయణ రావు పటేల్ ఆదేశానుసారం రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఢిల్లీ బిజెపి మాజీ ఎమ్మెల్యే తన్వీందర్‌సింగ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ క్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తన్విందర్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బీజేపీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నాయకులు మహమ్మద్ షఫీ, మండల ప్రధాన కార్యదర్శి సోమ సుధీర్‌రెడ్డి, బిలోలి మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, చందు భోజారెడ్డి, తోట నర్సయ్య, నరేష్ బాబు, జిలకరి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ పిఓ కుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆశ్రమ ఆదర్శ క్రీడా పాఠశాల ఉట్నూర్, ఆశ్రమ పాఠశాల హస్నాపూర్‌ను పిఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఔషధాల రిజిస్టార్ పరిశీలించి ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహించేందుకు విశ్వకర్మ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుల వృత్తులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో విశ్వకర్మల సమస్యలపై ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. కేంద్రం ఏ విధంగా అయితే విశ్వకర్మలను ఆదుకుంటుందో రాష్ట్ర ప్రభుత్వం అదేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు



నవతెలంగాణ-తాంసి

పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కప్పర్ల గ్రామ అంగన్వాడి సిబ్బంది గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించి పోషక ఆహారాలు అందించే వివిధ రకాల వస్తువులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గౌరీరాణి పాల్గొని గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహార జాగ్రత్తలను సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లు కూరగాయలు, పప్పు దినుసులు, గుడ్లు ప్రతిరోజు తినాలన్నారు. అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిశువు పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలని, అప్పుడే శిశువుకు నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడి కేంద్రాలలో మెనూ ప్రకారం పెట్టే ఆహారాన్ని తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సదానందం, మాజీ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సంతోష్, టీచర్లు నర్సమ్మ, శ్రీవాణి, గంగమ్మ, కార్యదర్శి నరేష్, గ్రామ ప్రముఖులు మహేందర్, నారాయణ ఉన్నారు.

రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి, ఎంపీ, శివసేన ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వాళ్లు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్, క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. సెంట్రల్ యూనియన్ మినిస్టర్ రవనీత్ బిట్టు ఓ ప్రతిపక్ష నేతను పట్టుకుని టెర్రరిస్ట్‌గా అభివర్ణించడం తగదన్నారు. అహంకార పూరితంగా మాట్లాడడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ నాలుక కోసి తీసుకొస్తే నగదు బహుమతులు ఇస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ బొండే, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ బహిరంగంగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ప్రధానమంత్రి తర్వాత ఆ హోదా కలిగిన వ్యక్తిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. స్వాతంత్రం పోరాటంలో బీజేపీ నేతలెవరైనా ప్రాణాలు అర్పించారా అని ప్రశ్నించారు. మత విద్వేషాలు సృష్టించి రాజకీయంగా పబ్బం గడుపుకునేవారు దేశ సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ హితవు పలికారు. అనుచిత వ్యాఖ్యలు చేసినవారిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఉద్యమిస్తామని తెలియజేశారు. ప్రధాని నరేంద్రమోడీ చర్యలు చేపట్టకపోతే వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్టేనని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నిరసన నినాదాలు చేశారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆశమ్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, ఆవుల వెంకన్న, ఇమ్రాన్, నాయకులు పోరెడ్డి కిషన్, రాజేశ్వర్, దాసరి ఆశన్న, రఫిక్, ఖయ్యూం, దర్శనాల చంటి, అంజద్ ఖాన్, ఆయూష్, దేశెట్టి ప్రభావతి, లత, ఉయికే ఇందిర, జుబేదా, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడి మృతి



నవతెలంగాణ-కడెం

మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన ఎగుర్ల బీరయ్య(70) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బీరయ్య బుధవారం మేకకు మేత తీసుకురావడానికి వెళ్లాడు. ఇంటి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఉన్న తీగను లాగే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నంలో మృతి చెందాడు. కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజురా గ్రామానికి చెందిన అప్ప పెద్ద పోతన్న, తోట సంజీవ్, హావర్గ గ్రామానికి చెందిన జక్కుల రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం గ్రామానికి చేరుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మండల బీజేపీ అధ్యక్షుడు జై సాగర్‌రావ్, మాజీ ఎంపీటీసీ ఓరికే నర్సవ్వ పోతన్న, విడిసి చైర్మన్ ప్రవీణ్, బీజేపీ జిల్లా కార్యదర్శి నల్ల రమేష్, నాయకులు నారాయణ, రాకేష్, రాజు, అశోక్, దేవేందర్, బాలరాజ్‌గౌడ్ ఉన్నారు. అనంతరం హవార్గ గ్రామానికి చెందిన ఒడ్నాల భూమేష్ ఇల్లు ఇటీవల ఎడతెరిపిలేని వర్షాలకు కూలడంతో ఎమ్మెల్యే పరిశీలించారు. కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యాన్నిచ్చారు.

ఈత మొక్కలు నాటి సంరక్షించుకోవాలి



నవతెలంగాణ-తాంసి

ఈత మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడుకునే బాధ్యత కల్లుగీత కార్మికులపై ఉంటుందని డిపిఈఓ హిమశ్రీ గౌడ కులస్తులకు సూచించారు. బుధవారం వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్ట్ పరిసరాల్లో ఎక్సైజ్ సిబ్బందితోపాటు ఎంపీడీవోతో కలిసి ఈత మొక్కలను నాటారు. గతంలో ఇదే ప్రాంతంలో దాదాపు 350 ఈత మొక్కలను ఉపాధి హామీలో భాగంగా నాటారని, సరైన సంరక్షణ లేకపోవడంతో పశువులు తొక్కేయడంతో ఎండిపోయాయని తెలిపారు. దీనిపై సిబ్బందితో పాటు గౌడ కులస్తులపై అసహనం వ్యక్తం చేశారు. గౌడ కులస్తులకు ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఈత చెట్లను అందిస్తోందని, కానీ ఆ మొక్కలను నాటడమే తప్ప వాటిని కాపాడుకునే బాధ్యత ఎవరూ తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఆ చెట్లు పెరిగితే గీత కార్మికులే ఉపాధి పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్, సిబ్బంది ముత్యం, లత, సుదాం, గిరి, ఎంపీఓ లింగయ్య, ఏపీఎం విజయ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఉపాధి సిబ్బంది నర్సింగ్, గీత కార్మికులు శ్రీనివాస్‌గౌడ్, శిరీష్‌గౌడ్, లింగంగౌడ్ పాల్గొన్నారు.

హిందీ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ భాష హిందీ దినోత్సవ పక్షోత్సవాలు భాగంగా ఈ నెల 20న శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో హిందీ వారోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా పాల్గొని హిందీ భాషను, జిల్లాలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులను ప్రోత్సహించి హిందీ భాషాభివృద్ధికి కషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షాను హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు గుజరాతి ప్రమోద్ ఖత్రితో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా హిందీ భాష సేవా సమితి చేపడుతున్న కార్యక్రమలను కలెక్టర్ ప్రశంసించారు. తప్పకుండా కార్యక్రమంలో తన వీలుని చూసి పాల్గొంటానని తెలిపినట్లు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి కోశాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించి విద్యను పటిష్టం చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి విద్యను పటిష్టం చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు తొడిశెట్టి రవీందర్ అన్నారు. బుధవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బీరవెల్లి, తాండ్ర, సారంగాపూర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలో పర్యవేక్షణ బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలలో కొత్త ఉపాధ్యాయుల నియామకం వరకు విద్యా వాలంటీర్‌లను వెంటనే నియమించి ప్రాథమిక విద్యను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రములో జిల్లా కోశాధికారి పోల ధర్మరాజ్, రాష్ట్ర నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల బాధ్యులు మొయిజొద్దీన్, నాయకులు శరత్ చందర్‌రెడ్డి, తాళ్ల చిన్నయ్య పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-కడెం

మండలంలోని పాత కొండుకూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి రూ.10,016 అందజేశారు. ఈ కార్యక్రమంలో భూమి దాత కళ్లెం రాజారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, సత్యనారాయణ, పర్ష గంగన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | సెప్టెంబర్ 19, 2024 | www.navatelangana.com

పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బీబ్ర గ్రామానికి చెందిన యువకుడు సామాజిక కార్యకర్త వెలిశాల సాయికుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంద్రసేన ప్లే స్కూళ్లలో పండ్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సేవా భావం కలిగి ఉండి ప్రజలకు సేవ చేసే సామాజిక కార్యకర్త సాయికుమార్ అని కొనియాడారు. ఆయన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువకులు రౌతు విగ్నేశ్వర్, గొడిసెల మణికంఠ గౌడ్, రాము వినోద్ గౌడ్, పాషా పూసాల సాయికుమార్, శాస్త్రి, ఆర్షత్ ఖాన్ పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమం

నవతెలంగాణ-పెంచికల్ పేట్



మండలంలోని బొంబాయి గూడా గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతహి సేవా స్వచ్ఛ స్వభావం స్వచ్ఛ సంస్కారం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో గ్రామస్తులతో కలిసి శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి నోటుబుక్కులను, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ప్రశాంత్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయుడు రాజన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఘాట్ రోడ్స్

- మూల మలుపుల వద్ద కానరాని సూచికలు
- తరచూ ప్రమాదాలతో ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు





నవతెలంగాణ-కెరమెరి

మూల మలుపుల వద్ద ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ముందు నుంచి వచ్చే వానాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని కెరమెరి ఘాట్ రోడ్ ప్రయాణికులకు కనువిందు చేస్తున్నప్పటికీ వాటి వెంటే ప్రమాదం కూడా పొంచి ఉంది. కెరమెరి ఘాట్ 9 కిలోమీటర్ల మేర 37 మూల మలుపులు ఉన్నాయి. ఏ ఒక్కచోట ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనా చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఘాట్‌లో రోడ్డు ఇరుకుగా ఉండడం, మూలమలుపుల వద్ద వాహనం తిరగడం ఇబ్బందిగా మారింది.

ఆకతాయిల చేష్టలతో..

ఎనిమిదేళ్ల క్రితం కెమెరి ఘాటుపై సిగ్నల్స్ సూచికల బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ ఆకతాయిలో పశువుల కాపరులు వాటిని చించి వేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కొత్త వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో పాత డ్రైవర్లు ఎలాగోలా వాహనాలు నడుపుతుంటే కొత్తవారికి చాలా ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకి ఇరువైపులా చాలా చోట్ల పిట్టగోడలు కూడా లేవు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో కెమెరా వాసులకు సంబంధాలు అధికంగా ఉన్నాయి. దీంతో వాహనాల రాకపోకలు ప్రతిరోజు అదిక సంఖ్యలో కొనసాగుతుంటాయి.

భూతద్దాల ఏర్పాటు

కెరమెరి ఘాట్ రోడ్డుపై ఆర్ అండ్ బీ అధికారులు గతంలో వినూత్నంగా రెండు చోట్ల భూతద్దాలు ఏర్పాటు చేశారు. మొత్తం 37 మూల మార్పులు ఉన్నప్పటికీ అత్యంత ప్రమాదకరంగా ఉన్నటువంటి చోట్ల మాత్రమే వీటిని ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు వల్ల ఎదురుగా వస్తున్న వాహనం కనిపిస్తుంది. దీంతో ముందే సైడ్ ఇచ్చేందుకు వీలుంటుంది ఫలితంగా ప్రమాదాల నివారణకు ఆస్కారం ఉంటుంది. మరోచోట ఏర్పాటు చేసిన భూతద్దం ఆకతాయిల చేష్టలతో నేల వాలింది.

వర్షాకాలంలో ఇబ్బందులే..

షేక్ సిరాజ్, వ్యాపారి, కెరమెరి



వర్షాకాలంలో చెట్ల పచ్చదనంతో గుబురుగా పెరుగుతాయి. చెట్ల పొదలమధ్య ముందు నుంచి వచ్చే వాహనం ఏ మాత్రం కనిపించదు. మూల మలుపుల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

ప్రమాదాలను నివారించాలి

ఆదే శంకర్, ఆన్‌లైన్ కేంద్రం నిర్వాహకుడు, కెరమెరి



ఈ రోడ్డుపై కొత్తగా వెళ్లేవారు వాహనం నడపాలంటే తడబడక తప్పదు అతి సమీపంలోనే మూలమలుపులు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది. తార్ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు ఘాట్ రోడ్లో రెండు వరుసల రహదారి చేపట్టాలి.

ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

సుజాయిత్‌ఖాన్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు



ఘాట్ రోడ్‌లో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనుమతి లేని కేటీసీ భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఘాట్ రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు ఘాట్ ఇరుక్కు పోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పడి చేయాలి.

గతంలో కొన్ని జరిగిన కొన్ని ప్రమాద సంఘటనలు

- 2010 అక్టోబర్‌లో వాడే కూడా కు చెందిన జి కృష్ణ ద్విచక్ర వాహనంపై పాట్నాపూర్ కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఐచర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2011లో సెప్టెంబర్‌లో వాంకిడి మండలం చీచుపల్లికి చెందిన దుర్వా మనోహర్ ద్విచక్ర వాహనంపై వాంకిడి నుంచి ఉట్నూర్‌కి వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2016లో జైలుకు చెందిన షేక్ ఆదిల్ ధనుష్ ఖాన్‌లో ద్విచక్ర వాహనంపై కెరమెరి నుంచి వెళ్తుండగా కెమెరాపై ముందు నుంచి వచ్చిన గుర్తులేని వాహనం ఢీకొట్టడంతో కాదు లక్కడికక్కడే మతి చెందగా యాలయ్యాయి.
- 2016 సెప్టెంబర్‌లో కెరమెరి మండలంలోని గౌరీ గ్రామానికి చెందిన రాథోడ్ మధుకర్ శివరాజు ద్విచక్ర వాహనంపై జైనూర్ నుంచి కెరమెరి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న మూలమలుపుల వద్ద బైక్ అదుపుత ప్పడంతో రాజు కాలు విరిగింది..
- 2021 అక్టోబర్‌లో ఆదేశ్వర గ్రామానికి చెందిన లక్ష్మణ్ దీక్షక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడికక్కడే మతి చెందాడు.
- 2023 ఏప్రిల్ 14న ఆదిలాబాద్‌కు చెందిన కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పెట్రోల్ బంక్ పగిలి కాలి బూడిదైంది. ఈ ఘటనలో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి బయటపడి ప్రాణాలను కాపాడుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్ సిర్పూర్(యూ) ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్షం తరపునకలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల ఆవిర్భవించిన నాటి నుండి మొట్ట మొదటిసారి చేసిన బదిలీలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలు 17 మంది బదిలీ అయ్యారని ఇద్దరు మాత్రమే వచ్చారని అన్నారు. సిర్పూర్(యూ) పాఠశాలలో ఒక్కరు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో మారుమూల జిల్లాలో పేద విద్యార్థులకు విద్యార్థి అందిస్తున్న ఆదర్శ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉండడంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలలో వెంటనే ఉపాధ్యాయులను, అధ్యాపకుల నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేదంటే అఖిలపక్షం తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా నాయకుడు కార్తీక్, జిల్లా నాయకుడు చిరంజీవి, కాంగ్రెస్ నాయకులు మురళి, సలీం, బీజేపీ నాయకులు విశాల్, సతీష్ బాబు జయరాజ్, బీఆర్ఎస్ నాయకులు జీవన్, బీఎస్పీ నాయకులు మాథర్ హుస్సేన్, టీడీపీ నాయకులు ప్రశాంత్, ఇతర నాయకులు టీకానంద్ వినోద్, భీమేశ్ పాల్గొన్నారు.

గుండి పాఠశాల ఉన్నతీకరణపై కలెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామంలో ఉన్న పాఠశాలను 10వ తరగతి వరకు ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రేను, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలను జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు ఉదయభాబుతో కలిసి మాజీ ఎంపీటీసీ మల్లేష్ మాజీ సర్పంచ్ రవీందర్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు వాగు ప్రవాహంలో ఇబ్బందులు పడుకుండా జిల్లా కేంద్రానికి రావాల్సి వచ్చేదని కలెక్టర్ నిర్ణయం వల్ల మా బాధ తప్పిందన్నారు. ఉత్తర్వుల విడుదలకు సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, అమన్, దత్తు, శ్యామ్ రావు, అసద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి తలపెట్టిన సమ్మె వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు పెండింగ్ వేతనాలు విడుదల కోసం నేటి నుండి చేయ తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఉపేందర్‌లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడు నెలలుగా బడ్జెట్ లేకపోవడం వలన కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఈ నెల 5వ తేదీన నోటీసు ఇచ్చి 10వ తేదీ నుంచి రోజు ఒక గంట ఆందోళన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. 19వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తామని నోటీసు ఇవ్వగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలు స్పందించి రాష్ట్ర నాయకులకు హామీ ఇవ్వడంతో పాటు పెండింగ్ వేతనాల కోసం బడ్జెట్ విడుదల చేయడంతో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారాన్ని కృషి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గిరిజన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విటల్ అన్నారు. బుధవారం మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని గ్రామస్తులు కోరగా రూ.10 లక్షల నిధులతో రోడ్డు మరమ్మతులకు త్వరలో నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పంద్రం పుష్పలత, మాజీ సర్పంచ్‌లు మధునయ్య, చంద్రమౌళి, నాయకులు అర్షద్ హుస్సేన్, జగ్గా గౌడ్, శంకర్ గౌడ్, కృష్ణ, సదాశివ్, రాచకొండ శ్రీ వర్ధన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన పిల్లకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా ఆశ్రమ పాఠశాల ఏఎన్‌ఎమ్‌లకు వార్డన్‌లకు ఆదేశించారు. బుధవారం కుమురంభీం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన పోషణ మిత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న వైద్యంలో రక్తహీనత లేకుండా రక్త పరీక్షలు నిర్వహించలని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చికూరగాయలు, గుడ్లు, మొవాలడ్డు, పల్లి పట్టి, అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మనోహర్, డీటీడీఓ రమాదేవి, గంగారాం, ఉమ్మడి జిల్లాల ఏటీడీఓలుం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఓటరు ముసాయిదా జాబితా

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచామని దానిపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వరరావు, డీపీఓ భిక్షపతితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 335 గ్రామపంచాయతీలలో గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రచురించడం జరిగిందని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 21వ తేదీ వరకు సంబంధిత గ్రామపంచాయతీలలో పంచాయితీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు ఈ నెల 26వ తేదీ వరకు పరిశీలించి 28వ తేదీన తుది ఓటరు జాబితాను అన్ని గ్రామపంచాయతీలలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలలో జాబితా ప్రచురించడం జరుగుతుందని, ఆన్ లైన్‌లో పొందుపరచడం జరిగిందని, అర్హత గల ఓటర్లు తమ వివరాలు పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే దిశగా బూత్ స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవన నిర్మాణం ఇతర కార్మిక రంగాల్లో ప్రభుత్వం అవలంబిస్తున్న ఇన్సూరెన్స్ ప్రక్రియను టెండర్లు వేయడాన్ని ఖండించారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించి నిధుల సక్రమ వినియోగం అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. టెండర్లు వేసే విధానాన్ని విరమించుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా సెప్టెంబర్ 10 నుంచి వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 20, 21, 22 తేదీల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ లోని లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఆనందరావు, జిల్లా కార్యదర్శి దూడల అశోక్ మండల అధ్యక్షుడు కమలాకర్, ఉపాధ్యక్షుడు రామచందర్, మండల కార్యదర్శి ధర్మాజీ రవి, మండల కోశాధికారి పులగం సదయ్య, మండల కమిటీ సభ్యుడు నాగపురి మురళి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాల మైదానంలో అండర్-14, అండర్-17 బాల బాలికల ఫుట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి డీఈఓ ఉదయ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సాంబశివరావు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్, ఫుట్ బాల్ కోచ్ రవి, వనిత, జితేందర్, రమేష్ పాల్గొన్నారు.


సామాజిక ఆస్పత్రి ఎదుట సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆస్పత్రుల్లో పనిచేసే శానిటరీ పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికుల జీతాలకు సంబంధించి బడ్జెట్ విడుదల చేసిన నేపథ్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో స్వీట్స్ పంచుకొని సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే కార్మికులకు జీతాలు విడుదలయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మల్లేష్, కార్మికులు మురళి, గంగన్న, శోభ, మమత పాల్గొన్నారు.

24న చలో కమిషనరేట్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న తలపెట్టిన చలో కమిషనరేట్ విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, అవుట్సోర్సింగ్ డైలీవేజ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రం నుంచి బస్సు జాత కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు దీనిని ప్రారంభిస్తారని జిల్లాలోని హాస్టల్ వర్కర్లు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిశాల క్రిష్ణమాచారి, ఉపాధ్యక్షులు అరిగేలా కోటయ్య, యూనియన్ జిల్లా నాయకులు పెంద్రం శంకర్, కొట్నాక హంసాబాయి, కర్సెంగా ప్రమీల, సులోచన, బాబురావ్, టేకమ్ ఛాయ, పద్మ అయ్యూబాయి పాల్గొన్నారు.

బండకాక, డాబా గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బండకాక, డాబా గ్రామాల్లో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ వ్యాధి నిరోదక టీకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు, గర్భిణీలకు వ్యాధి నిరోదక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సరైన సమయంలో టీకాలు వేయించుకోవాలని, గర్భిణీలు ప్రసవానికి వారం ముందుగానే ఆస్పత్రిలో చేరాలని, ఆస్పత్రిలో కాన్పు అయినట్టయితే తల్లీ, బిడ్డ సురక్షితంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గోదావరి, ఆశావర్కర్లు బాగుబాయి, ఈశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట మహాత్మ జ్యోతిరావు పూలే క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సౌత్ జోన్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో, లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని కుమారి మేకల అలేఖ్య అండర్-14 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెం, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ ఈ మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ కె రమాకల్యాణి తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికయిన విద్యార్థినిని, ప్రిన్సిపల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ కే మహేశ్వరరావు, పీఈటీ సిహెచ్. మమత, కళాశాల సిబ్బంది అభినందించారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ద సంఘం నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని రామాలయం నుంచి బస్టాండ్ వరకు డోలు వాయిద్యాలతో వెదురు ఉత్పత్తులు చేతిలో పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపాన ఉన్న మేదరి సంఘ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు ఎమ్మార్ నరసింహారావు ఉపాధ్యక్షుడు చిలువేరు నరసయ్య కోడి చుట్టూ రాజన్న, పర్ల శంకర్, రామన్న, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-జన్నారం

రాహుల్ గాంధీ దేశంలో నెంబర్ వన్ తీవ్రవాద అని వ్యాఖ్యానించిన, కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టు దిష్టిబొమ్మను బుధవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్షా మాట్లాడుతూ, దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబ ప్రాణ త్యాగాలు చేస్తే రాహుల్ గురించి అలా మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే కేంద్రమంత్రి రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్ మచ్చ శంకరయ్య కరుణాకర్, దుర్గమ్మ గంగాధర్,బండారి స్వామి, షాకీర్ ఎన్ ఎస్ వి ఐ నాయకులు అజ్మత్ ఖాన్, రజాక్ ఫసియుల్లా, ఇందయ్యా, అరె సిరీస్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ మృతిని గని ప్రమాదంగా గుర్తించాలి

- ఆర్థిక సాయం ప్రకటించాలి : సీఐటీయూ



నవ తెలంగాణ-మందమర్రి

లక్ష్మణ్ మృతిని గని ప్రమాదంగా గుర్తించి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయాన్ని ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. లక్ష్మణ్ అనే కోల్ కట్టర్ కార్మికుడు మంగళవారం కెకె-5 గనిలో రెండవ బదిలీ విధులు ముగించుకుని మ్యాన్ రైడింగ్‌పై వస్తున్న సమయంలో కింద పడిపోయాడు. వెనుక వస్తున్న కార్మికులు గమనించి పైకి తీసుకొచ్చే ప్రయత్నంలో లక్ష్మణ్ చనిపోయాడు. ఈ మేరకు సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎస్ వెంకటస్వామి, సెక్రటరీ అల్లి రాజేందర్ ప్రకటన విడుదల చేశారు. అందుబాటులో స్ట్రెచర్ ఉంటే తొందరగాపైకి తీసుకువచ్చే అవకాశం ఉండేదని, లేకపోవడంతో కార్మికుడు మృతి చెందాడని తెలిపారు. కార్మికుడు గని పరిధిలోనే చనిపోయాడు కనుక ఈ ప్రమాదాన్ని గని ప్రమాదంగా గుర్తించి టర్మినల్ బెనిఫిట్స్, బ్యాంక్ నుండి వచ్చే ప్రమాద బీమాతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి సూటబుల్ జాబు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మందమర్రి బ్రాంచ్ కమిటీ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం తరపున కూడా సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్లన్నింటిని కలుపుకొని పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పోడు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి



నవతెలంగాణ-తాండూర్

పోడు పట్టాలు కలిగిన రైతులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం) 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని కోరారు. పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. సమాచార హక్కు చట్ట నిబంధనలను అధికారులు పాటించాలని సూచించారు. రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసానిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అనావృష్టితో చాలామంది రైతులు వరి పంట వేయలేకపోయారని జూన్ జూలైలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట వేయని రైతులకు ప్రభుత్వం బీమా వర్తింపజేయాలన్నారు. ఈ మహా సభలో పార్టీ మండల కార్యదర్శిగా దాగం రాజారామ్‌ను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులుఅశోక్, జిల్లా నాయకులు దూలం శ్రీనివాస్, చల్లూరి దేవదాస్, దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్ పాల్గొన్నారు

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పీ సతీష్ తెలిపారు. బుధవారం లక్షెట్టిపేట పట్టణంలోని ఐబీ వద్ద ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించిన బాబు ఆచూకీ తెలిసింది. బాబు తల్లితండ్రులు చందారం గ్రామం ఆంద్రాకాలనికి చెందిన వేముల నవీన్ కుమార్ దంపతుల కుమారుడు కాగా ఉదయం పాఠశాలలో దింపి వెళ్లిపోగా అక్కడినుండి నడుచుకుంటూ ఐబీ ప్రాంతానికి వచ్చాడు. శోషల్ మీడియాలో చూసి సమాచారం అందుకున్న బాలుడి తల్లితండ్రులు పోలీస్‌స్టేషన్‌కు రాగా బాలుని క్షేమంగా తల్లితండ్రులకు అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలల్లో దింపిన తర్వాత ఇలా రావడం ఏంటని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఇలా జరిగిందని పేర్కొన్నారు. బాలుడిని అప్పగించిన సిబ్బందిని ఎస్సై అభినందించారు..

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మొర్రిగూడ, కిష్టాపూర్-మన్నెగూడ, కామన్ పల్లి, మందపల్లి, పోన్కల్, శ్రీలంక కాలనీ తదితర గ్రామాల్లో విస్తతంగా పర్యటించారు. డీఎంఎఫ్ నిధులతో రూ.2 కోట్ల 16 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, మురికి కాలువల, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజలు చేశారు. ఐటీఐ కళాశాలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కామన్‌పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం నేరవేరుస్తుందని తెలిపారు. దశల వారీగా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్ మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, ముత్యం సతీష్ దాముఖ కరుణాకర్, మహమ్మద్ రియాజుద్దీన్, పశువుల రజాక్, షాకీర్ మున్ను, నందు నాయక్, అల్లం వెంకటరాజం, మామిడిపల్లి ఇందయ్యదు మల రమేష్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని కమిషనర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్వచ్ఛత హీ సేవ 2024 స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం ఊరు మందమర్రి మినీ ట్యాంక్ బండ్ నందు క్లీన్లినెస్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్, మెప్మా రిసోర్స్ పర్సన్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి



నవతెలంగాణ-నస్పూర్

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ల జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 311 గ్రామపంచాయతీలలో మొదటి విడతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి, రెండవ విడతలో భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి, మూడవ విడతలో దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాలలోని గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 311 గ్రామపంచాయతీలలో 2వేల730 వార్డులలో 1లక్షా87 వేల 402 మంది పురుష ఓటర్లు, 1లక్షా91 వేల 468 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రచురించడం జరిగిందని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 21 వరకు సంబంధిత గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు ఈ నెల 26 వరకు పరిశీలించి 28న తుది ఓటరు జాబితాను అన్ని గ్రామపంచాయతీలలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలలో జాబితా ప్రచురించడం జరుగుతుందని, అర్హత గల ఓటర్లు తమ వివరాలు పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తెలిపారు.

ప్రతి విద్యార్థికి సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 'నిర్మాణ్' నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ మరియు సీఎస్ఆర్ ఇనిషియేటివ్ ఆఫ్ మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్గనైజేషన్'ల సంయుక్త భాగస్వామ్యంతో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. రమా కల్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి కంప్యూటర్ ల్యాబ్‌కు 20 కంప్యూటర్లు సమకూర్చబడ్డాయని, ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని తెలియజేశారు.

వీధుల్లో కుక్కల స్వైరవిహారం.. భయాందోళనలో ప్రజలు



నవతెలంగాణ-నస్పూర్

వీదుల్లో కుక్కలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో వీధి కుక్కలు స్వైర విహారం చేయడంతో పాఠశాల విద్యార్థులు భయంతో వెళ్లాల్సి వస్తుంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశవ్యాప్తంగా కుక్కలు మనుషులపై దాడులు చేస్తున్న కూడా అధికారులలో చలనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా ప్రాణాపాయం జరిగితేనే అధికారులు స్పందిస్తారా అని విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టి కుక్కల బెడద తగ్గించాలని పలువురు కోరారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గుండ్లపాడ్ గ్రామానికి నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ఆదివాసీ సేన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చాకటి రాధ, కమిటీ సభ్యురాలు పెంద్రం సోమేశ్వరి, మాడావి అంబు భాయి, పెంద్రం శారద, పెంద్రం హీరుబాయ్, సిడం లక్ష్మీ, అర్క అనంతబాయ్, చిక్రం చిత్తూబాయ్, పెంద్రం లచ్చుబాయి, పెంద్రం రవళి, పెంద్రం భవాని, మడావి దీపిక, పెంద్రం శిరీష పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-తాండూర్

వర్షాలు తగ్గుముఖం పట్టినందున పంచాయతీలలో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని తాండూర్ ఎంపీ ఓ అనిల్ సూచించారు. బుధవారం మండలంలోని ద్వారకాపూర్ పంచాయతీని సందర్శించి పంచాయతీ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయితీ 7 రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. నీరు నిలిచిన మురుగునీటి గుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీల పరిధిలోని మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రపరచాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాల్లో పెరిగిన కలుపు ను తీయించాలన్నారు. అవసరం మేరకు ఉపాధి హామీ పని దినాలను ఉపయోగించుకోవాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో ప్రజలు సేద తీరేందుకు అనుగుణంగా తయారు చేయాలని తెలిపారు. ప్రకృతి వనాల్లోని వాకింగ్ ట్రాకులను, సిట్టింగ్ బెంచ్‌లను శుభ్రపరచి వాకర్స్‌కు అనువుగా ఉండేలా తయారు చేయాలన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పాగింగ్ మిషన్లతో బయో స్ప్రే చేయాలని తెలిపారు. ఆయన వెంట పంచాయితీ సెక్రెటరీ కార్తీక్ ఎంపీఓ ప్రదీప్ రాజు ఉన్నారు.

35 శాతం వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటాను ఇవ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కుంచె భూపతి, టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి తలారి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెన్నుముకైనా సింగరేణి సంస్థకు 126 ఏళ్ల చరిత్ర ఉందని, సమైక్య ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు సింగరేణి సంస్థ 1998 కంటే ముందు బీఐఆర్ఎఫ్‌లోకి వెళ్లేటువంటి ప్రమాదం ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం వద్ద రూ.1263 కోట్ల అప్పుగా తెచ్చి సింగరేణి సంస్థను లాభాల్లోకి తెస్తే కార్మికులకు 10 శాతం లాభాల వాటా ఇస్తానని చెప్పి సింగరేణి సమస్త లాభాల్లోకి వచ్చిన తర్వాత 10 శాతం లాభాల వాటా ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికీ సింగరేణి కార్మికులకు గత సంవత్సరం 32 శాతం వాటా తీసుకోవడం జరిగిందని, అది తెలుగుదేశం ప్రభుత్వం ఘనత అని తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి-షాదీముబారక్ పథకం వరమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి-షాదీముబారక్ 45 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఈ పథకం పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో దోహద పడుతుందన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందజేస్తుందని తెలిపారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఎంపీడీఓ శశికళ పాల్గొన్నారు.



108లో ప్రసవం..తల్లీబిడ్డ క్షేమం



నవతెలంగాణ-వేమనపల్లి

108 అంబులెన్స్‌లో గర్భిణీ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఘటన బుధవారం వేమనపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సూరారం గ్రామానికి చెందిన కుక్కల శ్రీలతకి నెలలు నిండాయి. బుధవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. గర్భిణీ కుటుంబ సభ్యులు వేమనపల్లి108 సమాచారం ఇచ్చారు. గర్భిణీ బంధువులు అంబులెన్స్ వచ్చేలోపు ఆటోలో తీసుకెళ్దాం అని వెళుతున్న క్రమంలో అంబులెన్స్ సిబ్బంది కాస్త ఆలస్యమైన మేము వస్తాము అక్కడే ఆగండి అని చెప్పి వారి దగ్గరికి చేరుకొని గర్భిణీ స్త్రీని అంబులెన్స్‌లో ఎక్కించుకొని వెళుతున్న క్రమంలో దారిలో పురిటి నొప్పులు అధికం అయ్యాయి. దీంతో మార్గ మధ్యలో అంబులెన్స్ ఆపి అంబులెన్స్ పైలెట్ ముజామిల్, ఈఎంటీ సాహిర్ పాషా గర్భిణీ కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం చేశారు. శ్రీలత పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వారిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తల్లి, బిడ్డను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. సుఖ ప్రసవం చేసిన అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని లంబాడితండా(డీ) గ్రామానికి చెందిన అజ్మీర మౌనికకు గద్దె రాగడి గ్రామ శివారులో 108లో ప్రసవం చేశారు. మౌనిక కాన్పు కోసం కాసిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వచ్చారు. అక్కడి ఆస్పత్రి సిబ్బంది ఆమెని పరీక్షించి అత్యవసరం వైద్య సదుపాయంకు మంచిర్యాల ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. దింతో ఆసుపత్రి వర్గాల సమాచారం అందుకున్న మండల 108 సిబ్బంది మంగళవారం అర్ధ రాత్రి గర్భిణీని మంచిర్యాలకు తీసుకువెళ్తుండగా గద్దె రాగడి సమీపంలో గర్భిణీకి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది అంబులెన్స్‌లోని డెలివరీ చేశారు. మౌనికకు మగ శిశువు జన్మించాడు. ఇద్దరు క్షేమంగా ఉండగా అనంతరం ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఈఎంటీ ఆత్మరావ్, పైలట్ కొమరయ్యకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నప్రాసన

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని భరంపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ విజయ మాట్లాడుతూ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంతో పాటు విటమిన్స్, ప్రోటీన్స్ గల ఆహారం పిల్లలకు, గర్భిణులకు అందజేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని కోరారు. గర్భిణులు ప్రతినెల తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సూచన మేరకు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శీతల్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు జ్యోతి, కళ్యాణి, నాగుబాయి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత లోపించకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్



వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పరిశుభ్రత లోపించకుండా చూడాలని డీఎల్పీఓ ప్రభాకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ గ్రామంలో వాడవాడలో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో ఇంటి ట్యాక్స్ వసూలు తదితర రికార్డులు తనిఖీ చేశారు. వంద శాతం ట్యాక్స్ వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం పారిశుధ్య పనులను చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జవహర్ లాల్, ఎంపీవో స్వప్న షీలా, కార్యదర్శి శేఖర్ ఉన్నారు.

సృష్టికి మూలం విశ్వకర్మ భగవానుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సృష్టికి మూలం విశ్వకర్మ భగవానుడని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. దీనికి కంది హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచలోల ఉత్సవ మూర్తుల విగ్రహాన్ని ఊరేగించే రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కుల వృత్తులకు దూరమై విశ్వకర్మలు ఆర్థికంగా బాధపడుతున్నప్పటికీ వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం విశ్వకర్మల సంక్షేమ కోసం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, నాగన్న, పోరెడ్డి కిషన్ ,ఎల్చాల్వార్ సురేందర్, దాసరి ఆశన్న, డేరా కృష్ణారెడ్డి, బండి దేవిదాస్‌చారి, విశ్వకర్మ ఉత్సవ కమిటీ సభ్యులు సామన్‌పెల్లి నర్సిములు పాల్గొన్నారు.

రీజనల్ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో రూ.8 లక్షలతో పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ద్వారా నిర్మించిన రీజనల్ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ ఛాంబర్‌లో రీజనల్ సైనిక్ వెల్ఫేర్ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో సైనిక్ వెల్ఫేర్ కార్యక్రమాలైన ఐడి కార్డు జారీ చేసే విధానం, హౌస్ ప్లాట్స్, అగ్రికల్చర్ ల్యాండ్, క్యాంటిన్ ఏర్పాటు కొరకు వైద్య సదుపాయాలు కల్పించడం వంటి వాటిపై చర్చించారు. ఆర్మీ వితంతువైన సిరికొండకు చెందిన పూజకు రూ.2లక్షల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్‌కుమార్, జిల్లా యువజన క్రీడా, సైనిక్ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, లీడ్ బ్యాంకు మేనేజర్, పరిశ్రమల శాఖ పర్యవేక్షకులు, మాజీ సైనిక సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, ఉపాధ్యక్షులు అశోక్, సెక్రెటరీ మోహన్, క్యాషియర్ దేవన్న మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, రవి, డిబి చారి, సత్తయ్య, మధు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అతిత్ బేగం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు చెల్లించడానికి సెప్టెంబర్ 26 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆలస్య రుసుముతో అక్టోబర్ 4 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో పాల్గొనాలి



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామపంచాయతీలలో చేపడుతున్న స్వచ్ఛతహి సేవ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని తాండూర్ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. బుధవారం తాండూర్ పంచాయతీలోని తాండూర్ హైస్కూల్‌లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం లోభాగంగా విద్యార్థుల చేత మానవహారాన్ని నిర్మించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యం పై అవగాహన కల్పించారు. పిల్లలకు స్వచ్ఛతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలలో మహిళా సంఘ సభ్యులు స్థానిక నాయకులు హై స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ పంచాయతీ సెక్రెటరీ దివాకర్ పాల్గొన్నారు.

సివిక్స్ సబ్జెక్టు బోధనకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

ఆదర్శ పాఠశాలలో హవర్లి బెస్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు సివిక్స్ సబ్జెక్టు పీజీటీ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తో పాటు బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు బయోడేటాతో సంబంధిత విద్యార్హతలు జిరాక్స్ కాపీలతో మోడల్ స్కూల్‌లో ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సెప్టెంబర్ 24వ తేదీ లోపు సంప్రదించాలని తెలిపారు.

గని ప్రమాదాలు ప్రభుత్వ, యాజమాన్య హత్యలే...

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-కాసిపేట

గని ప్రమాదాలు కావని, ప్రభుత్వ, యాజమాన్య హత్యలే అని, ప్రమాదానికి కారకులైన అధికారులపై హత్య నేరం కేసు నమోదు చెయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. బుధవారం కాసిపేట మండలం సోమగూడెం ట్యాంక్ బస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంకె రవి మాట్లాడుతూ సింగరేణి శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో గత వారం రోజులుగా ఇద్దరు కార్మికులు యాజమాన్య నిర్లక్ష్యం మూలంగా మరణించారని, తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం కోసం యాజమాన్యం గని మరణాలుగా గుర్తించకపోగా చనిపోయిన కార్మికుడికి, వారి కుటుంబ సభ్యులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. మొన్న శ్రీరాంపూర్, నిన్న మందమర్రి ఏరియాలో కార్మికులు మరణించడం బాధాకరమైన విషయమని, లాభాలను లెక్కించుకునే యాజమాన్యం కార్మికుల ప్రాణాలను కాపాడడం కోసం చేపట్టాల్సిన రక్షణ చర్యలను గాలికి వదిలేసిందన్నారు. కనీసం ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న కార్మికులను తీసుకు వెళ్లడానికి స్ట్రక్చర్ కూడా లేకపోవడం, అందుబాటులో అంబులెన్స్ లేకపోవడం, ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోవడం సోచనీయన్నారు. బొగ్గు ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలు అంటే యాజమాన్యానికి లెక్క లేకుండా పోయిందని విమర్శించారు. కార్మికుల మరణాలను గని ప్రమాదాలుగా గుర్తించి ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారం, రావాల్సిన ఇతర బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే వారి కుటుంబాల్లో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులపై హత్య నేరం కేసులు నమోదు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు యాజమాన్యం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దూలం శ్రీనివాస్, గుమాస అశోక్, దాగం రాజారాం, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు చల్లూరి దేవదాస్, ఏల్పుల శంకర్ పాల్గొన్నారు.

వెదురు ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

ఇళ్లలో ప్లాస్టిక్ వస్తువులు నిషేధించి వెదురు ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తే మేదరులకు జీవనోపాధి ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహేంద్ర సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు కులవృత్తులు ఆయు పట్టుగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తుందన్నారు. కులవృత్తులు చేసుకునే వారు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహేంద్రలు వెదురుతో చాటలు, బుట్టలు గుల్లలు అల్లుకొని జీవనం సాగిస్తుంటారు. ప్లాస్టిక్ వచ్చిన నుంచి వారి ఆర్థిక పరిస్థితులు దిగజారిపోయాయి అన్నారు. వెదురు ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మేదరులపై అటవీ అధికారుల దౌర్జన్యాలను దాడులను ఆపడానికి అటవీ అధికారులతో మాట్లాడతామన్నారు. స్వేచ్ఛగా అడవిలోకి పోయి వెదురు తెచ్చుకొని అల్లికలు చేసుకునే విధంగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. మేదరులకు త్వరలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు ఎమ్మార్ నరసింహారావు ఉపాధ్యక్షులు చేరువేరు నరసయ్య ప్రధాన కార్యదర్శి కోడి జుట్టు రాజన్న, రామన్న, పోతు విజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్ ఇసాక్, మత్స్య శంకరయ్య, గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం సతీష్ మామిడిపల్లి ఇందయ్య, దాముఖ కరుణాకర్, దుర్గం గంగాధర్‌ఆరే సిరీస్, బండారి స్వామి, షాకీర్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రకే కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-తాండూర్



ప్రజలతో సన్నిహితంగా ఉంటూ నేరాలను నియంత్రించేందుకే కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంవీకే-5 ఇంక్లైన్ గ్రామంలో పర్యవేక్షణలో మాదారం ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అని తెలుసుకునేందుకు ఈ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వాహన దారులు తప్పకుండా అన్ని డాక్యుమెంట్స్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి కొత్త చట్టాలలో జరిమానాలు విధిస్తామని అన్నారు. మహిళల భద్రతే పోలీస్ ప్రధాన లక్ష్యం అని, మహిళ పట్ల, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వారిని మానసిక, శారీరకంగా హింసించిన వారిపట్ల చట్టపరమైన కఠిన చర్యలు చేపతామన్నారు. వారి రక్షణ కోసం షి టీమ్స్ నిరంతరం పని చేస్తున్నాయని పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలు చేక్ చేసి తమ వాహనాలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే సమాచారం అందించాలని తెలిపారు. అలగే సైబర్ నేరాల పాట్ల జాగ్రత్తగా ఉండాలనీ, మొబైల్ ఫోన్స్‌లను జాగ్రత్తగా వినియోగించాలని, చిన్న చిన్న తప్పులతో విలువైన డబ్బులను పోగొట్టుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ పర్యావ్యాసనల గురించి, ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తుకారం, పోలీస్ సిబ్బంది రమేష్, శశి కుమార్, అశ్విని పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన లక్ష్యంతో ఏర్పడిందే పీడీఎస్‌యూ

నవతెలంగాణ-మంచిర్యాల



సమ సమాజ స్థాపనకు పీడీఎస్‌యూ ఏర్పడిందని ఆ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మంచిర్యాల మార్క్స్ భవన్‌లో మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాల ప్రస్తుత, పూర్వ పీడీఎస్‌యూ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడ్వకేట్ ప్రకాశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి శ్రీనివాస్, నైనాల గోవర్ధన్, బివేణు, ఏ మంగా, ఏం సమ్మయ్య, రజియా, మల్లేష్, చంద్రయ్య, లాల్ కుమార్, శ్రీకాంత్, చరణ్, తిరుపతి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పీడీఎస్‌యూ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అర్ధ శతాబ్ద వారోత్సవ సభ అక్టోబర్ 24 ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తుందన్నారు. ఈ వారోత్సవాలకు పూర్వ విద్యార్థులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాయుధ రైతంగ పోరాట స్ఫూర్తితో నక్సల్బరీ శ్రీకాకుళం సాయుధ పోరాట వారసత్వంలో పీడీఎస్‌యూ ఏర్పడిందని అన్నారు. అసమానతలు లేని దోపిడి లేని సమ సమాజం కొరకు పోరాడుతుందని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో దోపిడి పీడనలేని పెట్టుబడిదారీ భూస్వామ్యానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేసిందని, అనేక మంది విప్లవ ఉద్యమంలో అమరులైనారన్నారు. పీడీఎస్‌యూ త్యాగాల చరిత్ర, పోరాటాల చరిత్ర, విప్లవ పార్టీలకు నాయకత్వం వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభంజనం, పూర్వ విద్యార్థులు గంగన్న, మల్లేష్, చంద్రమౌళి, సత్యం, శ్రీనివాస్, ఓదేలు, లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) ఠాగూర్ ఆడిటోరియంలో పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే 50 వసంతాల సభను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్ విద్యార్థులను కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సంఘం 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో విద్యార్థి రత్నాలు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, చేరాలు, రమణయ్య, సాంబయ్యలు తమ నెత్తురును ధార పోశారని తెలిపారు. వారి స్ఫూర్తితో గడిచిన 50ఏళ్ల ఉద్యమాన్ని సమీక్షించుకుంటూ భవిష్యత్ ఉద్యమ కర్తవ్యాల వెలుగులో శాస్త్ర విద్యా సాధన లక్ష్యంగా పోరాటాలు కొనసాగిస్తూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అండగా ఉంటూ విద్యార్థి హక్కులకు కొట్లాడుతుందని తెలిపారు. సెప్టెంబర్ 30న జరిగే భారీ బహిరంగకు సభకు విద్యార్థులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్, నాయకులు అజయ్, తరుణ్, రాధిక, శిరీష, రోషిని, వందన, రాజేశ్వరి, సోని, అన్నపూర్ణ, పుష్పలత పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఏకగ్రీవం



నవతెలంగాణ-హాజీపూర్

ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షునిగా గూడ అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రొడ్డం ఆంజనేయులు, కోశాదికారిగా పనాస దిలీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గని రవీందర్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అప్పాసు రామన్న, జిల్లా అధ్యక్షుడు నల్లపు సతీష్ కుమార్, జిల్లా కోశాధికారి శ్రీపతి రవి, మంచిర్యాల టౌన్ ప్రెసిడెంట్ రాజబాపు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్వాస తిరుపతి, నూనె సురేష్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచి కట్ల ఆశమ్మతో కలిసి ఆన్‌లైన్ లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు దేశెట్టి ప్రభావతి, లత, ఉయికే ఇందిర, సోనియా మంథని, జుబేదా, లక్ష్మి, సబీనా పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు విజయవంతం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు. ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతనికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రెవిన్యూ మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులకు, సిబ్బందికి, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సమితి గౌరవ అధ్యక్షులు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, పూసం ఆనంద్, కొత్తపల్లి సంజీవ్, మహిపల్, ఎన్నవార్ రాజు పాల్గొన్నారు.

కళాశాలలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎఫ్‌పిఓ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ధర్మానాయక్ ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, అనిత, సంతోషిని, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాజాతా బృందంతో అవగాహన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండలంలోని చందారం గ్రామంలో పోలీస్ కళాజాతా బృందం సభ్యులు మూఢనమ్మకాలు, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, గంజాయి, రాష్ డ్రైవింగ్, ఆత్మహత్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జానపద కళారూపాలతో బృందం సభ్యులు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అపోహలను నమ్మకూడదని తెలిపారు. పోలీస్ శాఖ అనుక్షణం ప్రజల కోసం పని చేస్తుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలని, ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.